పూడిపోతున్న వంకలు

- పంట పొలాలపైకి వర్షపు నీళ్లు
- పట్టించుకోని అధికారులు
- వర్షాకాలం నేపథ్యంలో ఆందోళనలో రైతులు


దేవన్న పాళ్యం వద్ద పూడిపోయిన వంక


కోతుల గుట్ట వద్ద వంక పరిస్థితి ఇలా..

మడకశిరరూరల్: నియోజకవర్గంలో పలు గ్రామాల సమీపంలోని ప్రధాన చెరువులకు వర్షపు నీరు వచ్చే వంకలు పూడిపోయాయి. దీంతో పొలాలపైకి నీరు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాల కాలం మొదలవడంతో పంటలపైకి నీళ్లు వస్తే మొత్తానికే నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

నియోజకవర్గంలో దాదాపుగా 50 వంకలు

మడకశిర మండలంలో సిద్ధగిరి, కోతుల గుట్ట, కదిరేపల్లి, భక్తరపల్లితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపుగా 50 దాకా వంకలు ఉన్నాయి. అయితే వంకల్లో చెట్లు పెరిగిపోవడం, పూడి పోవడం, తెగి పోవడంతో సమస్య వస్తోంది. ఇందు వల్లనే వర్షపు నీరు పంట పొలాలపై ప్రవహించనున్నాయి. పూడిపోయి చెట్లు పెరిగిన వంకల్లో పూడిక మట్టిని ఉపాధి హామీ పథకం కింద తొలగించి చెరువుల్లోకి వర్షపునీరు చేరితే సమీప గ్రామాలకు తాగు, సాగునీటికి కొంత వరకూ ఇబ్బంది ఉండదు. అలాగే రైతులు బోరు బావుల కింద పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. చెరువులకు వర్షపు నీరు వచ్చే ప్రధాన వంకలు పూడిపోవడం, చెట్లు పెరగడంతో కురిసిన వర్షపునీరు పంట పొలాలపై వెళ్లడంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది కురిసే వర్షపు నీరు పొలాలపై రాకుండా పెరిగిన చెట్లు, పూడిపోయిన, తెగిపోయిన వంకల్లో చెట్లు తొలగించి, మట్టిని తీస్తే చెరువులకు వర్షపు నీరు చేరుతుందని గ్రామీణులు చెబుతున్నారు. చెరువుల్లో వర్షపు నీరు నిల్వ ఉండి బోరు బావుల్లో కొంత వరకు నీటి మట్టం పెరుగుతుందంటున్నారు. ఇప్పటికైనా పూడిపోయిన వంకలను గుర్తించి ఇరిగేషన్, ఉపాధి హామీ ద్వారా మట్టిని తీసే పనులు చేపట్టి చెరువుల్లోకి వర్షపునీరు చేరేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతంలో టీడీపీ హామీ ఇచ్చినా..

2014 సంవత్సరంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉపాధి పథకానికి వ్యవసాయాన్ని అనుసంధానం అమలు చేసే దశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన చేసి అనుసంధానం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి



పూడి పోయిన వంకలను అధికారులు గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా పూడికతీత, చెట్లు తొలగింపు పనులు వెంటనే చేపట్టాలి. పంట పొలాలపై వర్షపు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలి. వర్షపు నీరు వృథాగా పోకుండా చెరువులకు చేరితే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ప్రభుత్వం, అధికారులు వంకల్లో పూడికతీత, తెగిపోయిన చోట మరమ్మతు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– నారాయణస్వామి, మడకశిర

వర్షపు నీరు వృథా చేయొద్దు



వర్షపు నీటిని వృథాగా పంట పొలాలపై ప్రవహించకుండా చెరువులకు చేరే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. వంకలు పూడిపోవడంతో చెరువులకు సరిగా వర్షపు నీరు చేరడం లేదు. వర్షా కాలం మొదలు కావడంతో ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన సంబంధిత అధికారులు ప్రధాన చెరువులకు వచ్చే వంకల ద్వారా వర్షపు నీరు వచ్చే విధంగా ఉపాధి హామీ పథకం ద్వారా వంకల్లో మరమ్మతు పనులు చేపట్టాలి.

– కెంచప్ప, మడకశిర

'యువత పోరు'కు తరలిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొళ్ల: జిల్లా కేంద్రంలో చేపట్టిన యువత పోరు నిరసన ర్యాలీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పతో కలిసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో సోమవారం తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి లోకేష్, జిల్లా యువజన సంఘం సంయుక్త కార్యదర్శి రవికుమార్, ఈసీ మెంబర్లు రఘువీర్, ముద్దారెడ్డితో పాటు మండల ప్రధాన కార్యదర్శి మంజునాథ్, నాయకులు మధుసూధన్, డి.రవికుమార్ తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

27న 'పురం'లో జగన్నాథ రథయాత్ర


బ్రోచర్లను విడుదల చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

హిందూపురం టౌన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 27న జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూపురం ఇస్కాన్ కమిటీ సభ్యులు మాధవ ప్రభు తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌ల జగన్నాథ రథయాత్ర బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంచాల మారుతీ, పారిశెట్టి శేఖర్, కేతా వెంకటేష్ తదితరులు మాట్లాడారు. పూరి జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని హిందూపురంలో కూడా జగన్నాథ రథయాత్రను నిర్వహించాలని ఇస్కాన్ కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో బాగంగా ఈ నెల 27న మధ్యాహ్నం 3 గంటల నుంచి ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీ కల్యాణ మండపం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. అక్కడి నుంచి తెలుగు తల్లి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, రైల్వే రోడ్డు మీదుగా వాసవీ ధర్మశాల వరకూ కొనసాగుతుందన్నారు. వాసవీ ధర్మశాలలో సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక భజనలు, 6 గంటలకు తులసి పూజ, 7 గంటలకు జగన్నాథ లీల ప్రవచనాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నామా రవి మోహన్ రాజ్, బండారు కిశోర్, గంగప్ప, నామ సంకీర్తన దాస్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ భూసేకరణ దేనికీ?

చిలమత్తూరు: మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి రైతులతో భూములు తీసుకున్న ప్రభుత్వం , అవి ఏర్పాటు చేయకుండానే మళ్లీ రైతులతో భూములు ఎలా అడుగుతారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నటరాజ్‌కు రైతులు వినతిపత్రం అందించారు. మండలంలోని వీరాపురం పంచాయతీని బయోడైవర్సిటీ చట్టం 2002 ప్రకారం పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ నిలిపివేశారని, ఇప్పుడు మళ్లీ భూసేకరణ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని, భూసేకరణలో వీరాపురం పంచాయతీని మినహాయింపు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు.

8 తులాల బంగారం చోరీ


బీరువాలోని వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం

పావగడ: తాలూకాలోని బ్యాడనూరు దొడ్డహట్టి గ్రామంలో శివరాజు అనే రైతు సంఘం నాయకుడి ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో ఉంచిన 8 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు, ముఖ్యమైన పత్రాలు దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. శివరాజు తన భార్య భాగ్యమ్మ చికిత్స నిమిత్తం బెంగళూరులో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలోనే చోరీ జరిగిందన్నారు. బాధితుడు శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

హిందూపురం టౌన్: పట్టణంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు నిర్వహించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాజ్, దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు అశ్వర్థ, నాయకులు శరణ్, బాబా ఫక్రుద్దీన్, జి.రమేష్, షబ్బీర్, శిల్పారెడ్డి, గౌతమి, సౌజన్య, రాజేశ్వరి, తదితర ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జగన్‌పై కేసు పెట్టడం దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనకు బదులు నిరంకుశ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక విమర్శించారు. సత్తెనపల్లి పర్యటనలో సింగయ్య అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే మాజీ సీఎం వైఎస్ జగన్ వాహనం కింద పడి చనిపోయినట్లు ఆపాదిస్తూ పచ్చ మీడియా తప్పుడు కథనాలు ప్రచురించిందన్నారు. నిజానిజాలు తేలకుండానే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై కేసు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. సింగయ్య చనిపోయిన రోజే ఆ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన వ్యక్తికి, వైఎస్ జగన్ వాహనం ఢీకొట్టలేదని మీడియా ముఖంగా వెల్లడించారన్నారు. అయితే నాలుగు రోజులకే మళ్లీ మాట మార్చి ఏఐ వీడియోలు చూపి వైఎస్ జగన్ వాహనం క్రింద పడిపోయాడని కేసు నమోదు చేశామని ఎస్పీ చెప్పడం వెనుక సీఎం చంద్రబాబు హస్తం ఉందన్నారు. జగన్‌కు జెడ్ ప్లస్ భద్రత కల్పించాల్సిన పోలీసులు కావాలనే భద్రతను తగ్గించారన్నారు. రాష్ట్రంలో అన్యాయం జరిగిన కుటుంబాలకు పరామర్శించేందుకు వెళ్లినా అనుమతి నిరాకరిస్తుండటం దారుణమన్నారు. ఆయనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. న్యాయం అన్నది ఎప్పటికైనా నిలబడుతుందని ఆమె స్పష్టం చేశారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్యులను నియమించండి


అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో డాక్టర్లను నియమించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఈఎస్‌ఐ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జిల్లా కోశాధికారి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ హిందూపురం ప్రాంతంలో దాదాపు 40 వేల మంది కార్మికులు ఈఎస్‌ఐ చెల్లిస్తున్నారని, అయితే హిందూపురం, కొట్నూరు ఈఎస్‌ఐ ఆస్పత్రుల్లో సరైన మందులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సరైన వైద్య సిబ్బందిని, మందుల సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని, లేకపోతే దశల వారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ హిందూపురం తాలూకా కార్యదర్శి మారుతీరెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నౌషద్, సహాయ కార్యదర్శి శివప్ప, జియా తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా నరేష్

లేపాక్షి: లేపాక్షి మండల హౌసింగ్ ఏఈగా కే.నరేష్ సోమవారం బాధ్యతలను చేపట్టారు. లేపాక్షిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిని పొంది మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న 6, 7, 8, 9 తరగతుల ప్రవేశానికి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హనుమన్న తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మంగళవారం పాఠశాలలో నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

పట్టాలు పంపిణీ చేయండి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద సర్వే నంబర్ 700లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారికి పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు సోమవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అలాగే పందిపర్తి రెవెన్యూ పొలంలో భూమి సాగు చేస్తున్న రైతులకు సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజ్ గోపాల్, నాయకులు బాలస్వామి, చాంద్ భాషా, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుకొండ రూరల్: ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ, ఇతర సమస్యలపై ఆరు ఫిర్యాదులు అందినట్లు కార్యాలయ డీటీ ప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి

హిందూపురం: విద్యను వ్యాపారంగా మారుస్తూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్, కళాశాల్లో బుక్‌స్టాల్స్ తెరిచి నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్‌ఏ పార్లమెంటరీ ప్రెసిడెంట్ నవీద్, సెక్రటరీ సల్మాన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ గంగప్పకు వినతి పత్రాన్ని అందించారు.

వయో వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాలి

పావగడ: ఇంట్లోని వయో వృద్ధులను చంటి పిల్లల్లా, కంటికి రెప్పలా చూసుకోవాలని స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి విమాదేశ్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం నిర్వహించిన విశ్వ వయో వృద్ధుల దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొందరు కుమారులు, కుమార్తెలు తల్లిదండ్రులను ఆస్తుల కోసం రోడ్లపైకి లాగుతున్నారన్నారు. తమ జీవితాలను ఫణంగా పెట్టి పెంచిపోషిస్తే ఈ విధంగా ప్రవర్తించడం దారుణమన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైంది

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి



చిలమత్తూరు: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో ఈ ఏడాది కాలంలో అత్యాచారాలు, హత్యలు, మహిళలకు అవమానాలు ఎక్కువయ్యాయన్నారు. టీడీపీకే చెందిన తెలుగు మహిళ శిరీష పట్ల చిలకలూరిపేట సీఐ అమానుషంగా ప్రవర్తించి ఆమె వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. పార్టీల విషయం పక్కన పెడితే అసలు మహిళలకే రక్షణ లేదని, అవమానిస్తున్నారని పేర్కొన్నారు. అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన శిరీషకు న్యాయం చేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబు, లోకేష్‌పై ఉందన్నారు. మహిళలపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, పార్టీ నేతలు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారన్నారు. సొంత పార్టీ వారైనా, ఇతరులైనా ఇలా అవమానాలు ఎదుర్కోవల్సిందేనా అని ప్రశ్నించారు. ఈ అరాచకాలు ఇలాగే కొనసాగితే మహిళాలోకం రోడ్లపైకి ఎక్కే పరిస్థితి వస్తుందన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీ నియామకం

మడకశిరరూరల్: మడకశిర నగర పంచాయతీ కమిటీని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం సాయంత్రం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసింది. నగర పంచాయతీ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా ఈఎం గోపి, మధుసూదన్, జనరల్ సెక్రటరీలుగా ఓఎమ్ కుమార్, మారుతీ, నరసింహస్వామి, జి.అన్సర్‌ఖాన్, సెక్రటరీలుగా బాలకృష్ణారెడ్డి, ఎంటీ. చంద్రశేఖర్, పీఎస్.రవితేజ్, అంజలి, రఘునందన్ ఎంపిక చేశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నరసింహప్ప, శివానాయక్, నాగరాజు, చంద్రశేఖర్, బీరప్ప, శ్రీనివాసులు, జయరాజ్, అనిల్‌కుమార్, వెంకటేశులు, ఆర్.అంజన్‌కుమార్, జబీవుల్లా, శ్రీనాథ్, సుధీర్‌రెడ్డి, మధు, నంజప్ప, సతీష్‌రెడ్డి, రాజ్‌కుమార్, నాగభూషన్‌రెడ్డి, జి.రామచంద్రారెడ్డి, రమేష్‌ను నియమించారు.

భూపంపిణీ చేయాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామ పొలంలో అర్హులైన రైతులకు భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఐదేళ్లుగా రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాగే జగనన్న లే అవుట్‌లో ఇల్లు నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. సీఎస్‌డీటీ మోహన్ నాయక్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

పదవి విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

రొళ్ల: మండల పరిధిలని కాకి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఆర్ఎస్ఎల్ఎన్ మూర్తిని సోమవారం అలుపనపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యంజారప్ప, ఉపాధ్యాయులు నారాయణప్ప, గోవిందరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ అధికారులకు సన్మానం

హిందూపురం: హిందూపురం ట్రెజరీశాఖలో పనిచేస్తున్న ధనుంజయ పుట్టపర్తికి బదిలీ కావడంతో సోమవారం ఇందిరాపార్క్‌లోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. అలాగే పుట్టపర్తి నుంచి హిందూపురంకి వచ్చిన ఎస్‌టీఓ జగదీశ్వర్‌ను స్వాగతిస్తూ సన్మానించారు.కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుల్లప్ప, సెక్రటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా అపర్ణ

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా అపర్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు పదోతరగతి, ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేస్తామన్నారు.

క్లుప్తంగా

కెనరా బ్యాంకులో రైతుల ఆందోళన


నిరసన తెలుపుతున్న లక్ష్మమ్మ, శ్రీనివాసరెడ్డి

పరిగి: మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ముందు బాధిత రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. హొన్నంపల్లికి చెందిన లక్ష్మమ్మ అనే 90 ఏళ్ల వృద్ధురాలి కుమారుడు శ్రీనివాసరెడ్డి సర్వే నంబరు 202, 242 పైకి గతంలో క్రాప్‌లోన్ రూ.2.50 లక్షలు తీసుకున్నారు. ఈ ఏడాదికి రెన్యూవల్ చేయడానికి వెళ్తే గతేడాది తీసుకున్న లోను మొత్తం రెన్యూవల్ కాలేదని, తాజాగా వడ్డీతో కలిపి రూ.32 వేలుతో కలిసి ఫెనాల్టీతో కలిసి దాదాపు రూ.38 కడితేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో ఖంగుతిన్న శ్రీనివాసరెడ్డి బ్యాంకు అధికారుల వైఖరికి నిరసనగా వారు ఆందోళనకు దిగారు. లోను కంటే అదనంగా ఎందుకు కట్టాలని నిలదీశారు. వెంటనే ఉన్నతాధికారులు, ప్రభుత్వాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

బ్రిడ్జిపై నుంచి పడిన ఆటో


బిడ్జి పై నుంచి కిందకు పడిపోయిన ఆటో

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది బిడ్జిపై నుంచి ఓ ఆటో బోల్తా పడింది. సోమవారం సాయంత్రం పెనుకొండ వైపు నుంచి రొద్దం వైపు వస్తున్న ఆటో గ్రామ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బిడ్జి పైనుంచి పెన్నాలోకి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. అయితే ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు.

'విద్యాశక్తి పథకం' కింద తరగతులు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యాశక్తి పథకానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి అవసరమైన సామర్థ్యాలను పెంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ మద్రాస్ సహకారంతో నిర్వహిస్తున్న విద్యాశక్తి పథకానికి 74 కళాశాలలు ఎంపిక కాగా అందులో పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉందన్నారు. ఈ ప్రోగ్రాం కింద సోమవారం నుంచే తరగతులు ప్రారంభించామన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టండి

చిలమత్తూరు: చిలమత్తూరు పంచాయతీలో గత ఏడాదిగా నిధులు గోల్‌మాల్ జరిగింది. పంచాయతీ నిధులను ఇష్టారాజ్యంగా డ్రా చేసుకొని తినేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు, టీడీపీ నేతలు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేశారన్నారు. ఇంటి, నీటి పన్నులు, భవనాలు అనుమతులు వంటి నిధులను సైతం పక్కదారి పట్టించారన్నారు. వాటిపై దర్యాప్తు జరిపితే అసలు విషయాలు బయటకు వస్తాయని వివరించారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలని వినతి

లేపాక్షి: లేపాక్షి పంచాయతీలోని సర్వే నంబర్ 279-5లో 0.59 సెంట్ల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. నాయకులు నారాయణరెడ్డి, గౌతమ్‌కుమార్, ప్రేమావతమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు


దగ్ధమైన ద్విచక్ర వాహనాన్ని చూపుతున్న బాధితుడు

రొద్దం: మండల పరిధిలోని పి.రొప్పాల గ్రామానికి చెందిన ఎం నరసింహమూర్తికి సంబంధించి ద్విచక్ర వాహనానికి (హోండా షైన్) గుర్తు తెలియని దుండగులు సోమవారం నిప్పంటించారు. 2024 మోడల్ వాహనాన్ని డ్వాక్రా సంఘంలో రుణం తీసుకుని కొనుగోలు చేశామని, వాహనం మొత్తం కాలిబూడిదైందని బాధితుడు వాపోయారు. పోలీసులు నేరస్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రహదారికి అడ్డంగా మెట్లు



రహదారికి అడ్డంగా ఏర్పాటు చేసిన ఐరన్ మెట్లు

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రైవేట్ బస్టాండ్ సమీపంలో వాణిజ్య సముదాయ భవన యజమానులు అక్రమంగా బిల్డింగ్ పైభాగానికి వెళ్లేందుకు కింది భాగంలో ఉన్న రహదారిపైనే ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన మెట్లు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అటుగా వెళ్లలేకపోతున్నామంటున్నారు. రహదారిపై వచ్చే వ్యక్తులకు మెట్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మెట్లను తొలగించాలని కోరుతున్నారు.

బోరులో నీళ్లు పడినా కష్టాలే..


మెళవాయి బీసీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న వాటర్ స్కీమ్ బోరు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి బీసీ కాలనీలో మూడు నెలల క్రితం బోరు వేశారు. నీళ్లు కూడా సమృద్ధిగా పడ్డాయి. అయితే ఇంత వరకూ వాటర్ స్కీమ్ బోరుకు మోటారు అమర్చకపోవడంతో తాగు నీటి సమస్య వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. నీటి కోసం ఎన్నో అవస్థలు పడుతున్నామని, వెంటనే బోరుకు మోటారు అమర్చి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరుతున్నారు.

హైవే పక్కనే వ్యర్థాలు


జాతీయ రహదారి పక్కనే వేసిన వ్యర్థాలు

పెనుకొండ రూరల్: జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలు వేయడం బాటసారులకు, వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. పెనుకొండ మండలం గుట్టూరు వై జంక్షన్‌లోని 44వ జాతీయ రహదారి పక్కన విచ్చలవిడిగా చికెన్ వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసనతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కియా పరిశ్రమ రాకతో ఈ ప్రాంతం హోటళ్లు, చికెన్ సెంటర్లతో వాణిజ్యపరంగా విస్తరించింది. అయితే వ్యాపారులు వ్యర్థాలను జాతీయ రహదారి పక్కనే వేస్తుండటంతో సమస్య వస్తోంది. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.